క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దపప్పూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

తాడిపత్రి టౌన్: స్థానిక యల్లనూరు రోడ్డు సర్కిల్ సమీపంలోని వరదయ్య కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌కు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు క్రియేటర్ కృష్ణ వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బహుత్తమ పద్మ శాలీయ సంఘం అధ్యక్షుడు గడ్డం గణేష్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు జ్ఞాపక శక్తి, ఏకాగ్రత, పరీక్షల భయాన్ని తొలగించుటపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు చెన్న రంగ ప్రసాద్, హరికృష్ణ, సుబ్రమణ్యం, శివశంకర్, పరమేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

చీనీచెట్లు దగ్ధం

పుట్లూరు: వేసవి ఆరభంలోనే అగ్ని ప్రమాదాలు రైతన్నలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. వర్షాలకు పెరిగిన గడ్డి ప్రస్తుతం ఎండిపోవడంతో అగ్ని ప్రమాదాలు పెరిగిపోయాయి. శనివారం వెంగన్నపల్లిలో సీతాఫలం తోటకు మంటలు వ్యాపించి నష్టం వాటిల్లగా, ఆదివారం కోమటికుంట్ల గ్రామానికి చెందిన నరేంద్రరెడ్డికి చెందిన 40 చీనీ చెట్లు, రామాంజినేయులు చెందిన 20 చీనీ చెట్లు అగ్ని ప్రమాదంతో కాలిపోయాయి.

కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు

పామిడి: గజరాంపల్లి గ్రామ క్రాస్ వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లె వాసి రామిరెడ్డి పామిడి వైపు నుంచి బైక్‌పై ఆవులాంపల్లెకు బయలుదేరాడు. గజరాంపల్లి క్రాస్ వద్ద మలుపు తిరుగుతున్న బైక్‌ను గుత్తి నుంచి వస్తున్న కారు వేగంగా వచ్చి ఢీ కొంది. ప్రమాదంలో రామిరెడ్డి తీవ్ర రక్తగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని వెంటనే అనంతపురం సర్వజనాసుపత్రికి తరలించారు. పామిడి పోలీసులు కేసు చేశారు.

నేడు గృహసారధులకు శిక్షణ

గార్లదిన్నె: ఎగువపల్లి వద్దనున్న వైఎల్ఆర్ ఫంక్షన్ హాల్లో సోమవారం ఉదయం 9 గంటలకు సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి తెలిపారు. ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరి సాంబశి వారెడ్డి ముఖ్యఅథితులుగా హాజరవుతారన్నారు.మండలంలోని ప్రజాప్రతినిధులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

నేడు 'స్పందన' రద్దు

యల్లనూరు: తహసీల్దారు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమం రద్దు చేసినట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ నాగలక్ష్మి సెల్వరాజన్ రద్దు చేశారన్నారు. మండల ప్రజలు గమనించాలని కోరారు.

పెన్షనర్లు నెలాఖరులోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

తాడిపత్రి టౌన్ : తాడిపత్రి ట్రెజరీ పరిధిలోని ప్రభుత్వ పెన్షనర్స్ అందరూ ఈనెల 28 లోపు ఈకెవైసీ తప్పక చేయించుకోవాలని తాడిపత్రి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కత్తి లక్ష్మీనారాయణరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మొబైలు, ఆధార్‌కార్డు సీఎఫ్ఎంఎస్ నంబర్‌తో ఈకెవైసీ చేయిస్తామని పేర్కొన్నారు.

బ్రిడ్జితోపాటు బ్యారేజీ నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాగార్జునరెడ్డి తదితరులు

తాడిపత్రి టౌన్ : కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి బదులుగా బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మించాలని, ఈ విషయాన్ని అసెంబ్లీలో ప్రస్తావించాలని రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ రాష్ట్ర అధ్యక్షుడు నాగార్జునరెడ్డి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని కోరారు. ఈమేరకు ఆదివారం ఎమ్మెల్యేని ఆయన స్వగృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. కర్నూలు, అనంతపురం , కడప జిల్లాలకు జీవనాధారమైన తుంగభద్ర నికర జిలాలను గండికొడుతూ కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టును నిలుపుదల చేసేలా అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. ఆయన వెంట తాడిపత్రి శాఖ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, దూదేకుల కుళ్లాయిప్ప, శ్రీనివాసరెడ్డి, శివశంకర్‌రెడ్డి ఉన్నారు.

టౌన్ బ్యాంకు సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుత్తి రూరల్: గుత్తి టౌన్ బ్యాంకు ఖాతాదారులు, డిపాజిటర్లకు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణ శివారులోని స్పందన ఫంక్షన్ హాల్‌లో గుత్తి కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు శతాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, వివిధ బ్యాంకుల అధ్యక్షులు, సీఈఓలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా టౌన్ బ్యాంకు అధ్యక్షుడు అబ్దుల్ జిలాన్ అధ్యక్షతను జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఖాతాదారులు, వాటాదారులు, పాలక వర్గం, సిబ్బంది కృషితో గుత్తి టౌన్ బ్యాంకు శత వసంతాలు పూర్తి చేసుకుందన్నారు. బ్యాంకు మరింత అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. బ్యాంకుకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. మాజీ ఎంపీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ, ప్రైవేటు బ్యాంకులకు దీటుగా ఖాతాదారులకు సహకార బ్యాంకులు సేవలు అందిస్తున్నాయన్నారు. టౌన్ బ్యాంకు అధ్యక్షుడు జిలాన్ మాట్లాడుతూ కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకుల ద్వారా అతి తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తూ వ్యాపారులతో పాటుగా అన్ని వర్గాల అభివృద్ధికి బ్యాంకు పాటుపడుతోందన్నారు. బ్యాంకులో రూ.95 కోట్లు డిపాజిట్లు ఉండగా రూ.81 కోట్లు రుణాలు ఇచ్చామన్నారు. బ్యాంకుకు ఏడాదికి రూ.2.5 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్తా, వైజాగ్, కాకినాడ బ్యాంకుల అధ్యక్షులు మానం ఆంజనేయులు, రవీంద్ర, బ్యాంకు సీఈఓ మహేశ్వర ప్రసాద్, బ్యాంకు ఉపాధ్యక్షుడు కృష్ణ, డైరెక్టర్లు వెంకటేష్, మధుసూదన్, రామమోహన్, మహబూబ్, మహేష్‌కుమార్, దాదా పాల్గొన్నారు.

అభివృద్ధిపై దళిత సంఘాల నేతల వ్యాఖ్యలు విడ్డూరం



మాట్లాడుతున్న రాజగోపాల్, నాగరత్నమ్మ

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజక వర్గ అభివృద్ధిపై దళిత సంఘాల నాయకుల వ్యాఖ్యలు విడ్డూరంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శింగనమల నియోజక వర్గంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి నేతృత్వంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. దాదాపు 30 ఏళ్ల శింగనమల చెరువు లోకలైజేషన్ సమస్యను ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పరిష్కరించారని గుర్తు చేశారు. కొంత మంది దళిత సంఘాల నాయకులు వైఎస్సార్ సీపీపై కావలనే బురదజల్లే ప్రయత్రం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఏనాడైనా అభివృద్ధి గురించి గత పాలకుల వద్ద అడిగిన పాపాన పోలేదన్నారు. ఏనాడూ ఉద్యమాలు చేసిన సందర్భాలు లేవని గుర్తు చేశారు. శింగనమల చెరువు మరువ వద్ద బ్రిడ్జి నిర్మాణంపై సీఎంకు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రతిపాదనలు పంపారని త్వరలో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. బీకేఎస్ వద్ద బ్రిడ్జి తగ్గులో నిర్మించారని, అప్పట్లో ఎందుకు అడగలేదని దళిత సంఘాల నాయకులను ప్రశ్నించారు. గత ప్రభుత్వాల్లో పని చేసిన ఎమ్మెల్యేలను ప్రశ్నించలేని వారు ఇప్పుడు అభివృద్ధి జరుగుతున్న సమయంలో ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, సిద్దరాచెర్ల సర్పంచ్ రామాంజనేయులు, ఎస్సీసెల్ అధ్యక్షులు వరికూటి కాటమయ్య, చల్లా నాగేశ్వర రావు, సాకే కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే వైవీఆర్, నైరుతిరెడ్డి

గుంతకల్లు రూరల్: కసాపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఆదివారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీకి చెందిన రాజా వలి, మహబూబ్ బాషా, షేక్ ఖాదర్‌వలి, షేక్ ఫకృద్దీన్, లాల్‌సాబ్, సుభాన్‌బాషా, సద్దాం, షేక్ రజియా, హిమం బీ తదితరులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం వైఎస్సార్‌సీపీ తీర్థ పుచ్చుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వైవీఆర్ వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పట్ల ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు తెలిపారు. గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, బెస్త మనోహర్, వినోద్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన కార్పెంటర్‌కు ఆర్థికసాయం



కార్పెంటర్ సుదర్శన్‌కు నగదు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడిపత్రి టౌన్: ప్రమాదంలో గాయపడిన సుదర్శన్ ఆచారి అనే కార్పెంటర్‌కు ఆదివారం లయన్స్‌క్లబ్ సభ్యులు, తాడిపత్రి కార్పెంటర్ అసోసియేషన్ సభ్యులు ఆర్థిక సాయం చేశారు. టైలర్స్‌కాలనీకి చెందిన సుదర్శన ఆచారి ప్లయ్‌వుడ్ పని చేస్తుండగా జరిగిన ప్రమాదంలో కాలుకు తీవ్ర గాయమైంది. కార్పెంటర్ ఆర్థిక పరిస్థితిని గుర్తించి లయన్స్‌క్లబ్ సభ్యులు రూ.28 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు హరినాథరెడ్డి, కార్పెంటర్ అసోసియేషన్ అధ్యక్షుడు నబీరసూల్, సభ్యులు జక్కన్న, శివ, గురు, కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా రూరల్ పరిధిలోని రమణ మహర్షి ఆశ్రమంలోని 75 మంది అనాథ విద్యార్థులకు లయన్స్ క్లబ్ సభ్యుడు వెంకటేష్ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకు స్కూలు బ్యాగులు, స్వీట్స్‌ను పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు హరినాథరెడ్డి, పీడీజీ రమేష్‌నాథరెడ్డి, సభ్యులు సంజీవరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మధు, రమేష్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

అశ్వత్థంలో భక్త జనసందడి



ప్రత్యేక అలంకరణలో నారాయణ స్వామి భూదేవి ఉత్సవ మూర్తులు



ప్రత్యేక అలంకరణలో భీమలింగేశ్వరస్వామి

పెద్దపప్పూరు: దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన అశ్వర్థనారాయణ స్వామి క్షేత్రంలో నాలుగో ఆదివారం తిరునాల సందర్భంగా పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో సందడి ఎటుచూసినా సందడి కనిపించింది. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరించి తడి దుస్తులతో శింగరబట్టు మహాముని, మహాగణపతి, అశ్వర్థనారాయణ స్వామి, శ్రీచక్ర భీమలింగేశ్వర స్వామి, శ్రీవల్లీ సుబ్రహ్మణ్యేశ్వరుల చుట్టూ ప్రదక్షిణలు చేసి తమ కోర్కెలు నెరవేరేలా దీవించమని స్వాములను వేడుకున్నారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి సన్నిధిలో పొంగుబాలను పెట్టి స్వామికి నైవేద్యం సమర్పించడంతో పాటు తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన దాతలు అన్నదాన శిబిరాలు ఏర్పాటుచేశారు. భక్తులు ఇబ్బందులు పడకుండా ఆలయ చైర్మన్ చిక్కేపల్లి శ్రీనివాసరెడ్డి, ఈఓ సుబ్రహ్మణ్యం సౌకర్యాలు ఏర్పాటు చేశారు. పెన్నానదిలోని స్నాన ఘాట్‌ల వద్ద ఎలాంటి తాడిపత్రి డీఎస్పీ వీఎన్‌కే చైతన్య, రూరల్ సీఐ చిన్నపెద్దయ్య, ఎస్‌ఐలు ఖాజాహుస్సేన్, మహ్మద్ గౌస్ పర్యవేక్షించారు. తిరునాల సదర్భంగా వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపింది.



పెన్నానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రిటైర్డ్ హెచ్‌ఎం కృష్ణమూర్తి మృతి



గుత్తి: పట్టణంలోని ఉప్పర వీధిలో నివాసముండే రిటైర్డ్ హెడ్మాష్టర్ కృష్ణమూర్తి అలియాస్ పంతులు ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారు జామున మృత్యువాతపడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పంతులు మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వైఎస్సార్ సీపీ నాయకులు , ఆయా శాఖల అధికారులు సంతాపం ప్రకటించారు. మృతుని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన సూరి

గుత్తి: పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో శ్రీసాయి డిగ్రీ కాలేజీ సమీపంలో శనివారం అర్ధరాత్రి సమయంలో రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే పెద్దవడుగూరుకు చెందిన సూరి పని మీద ఆటోలో గుత్తిఆర్ఎస్‌కు వచ్చాడు. పని ముగించుకుని తిరిగి పెద్దవడుగూరు వెళుతుండగా శ్రీసాయి డిగ్రీ కాలేజీ సమీపంలో వెనుక నుంచి మరో ఆటో ఢీ కొనింది. ఈ ప్రమాదంలో సూరి తీవ్రంగా గాయపడ్డాడు. 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు మృతి

గార్లదిన్నె: కెకె తండాలో ఆత్మహత్యకు యతి్నంచిన ఓ రైతు మృతి చెందాడు. ఎస్ఐ సాగర్ వివరాల మేరకు... తండాకు చెందిన శ్రీనివాసుల నాయక్(41) తనకున్న 3.50 ఎకరాల్లో చీనీ పంట సాగు చేసి జీవనం సాగిస్తుండేవాడు. పంట పెట్టుబడి కోసం దాదాపు రూ.లక్షలు అప్పు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మధనపడుతుండేవాడు. ఈక్రమంలో ఇటీవల కుమార్తె ప్రేమ వివాహం చేసుకోవడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించకపోవడంతో ఆదివారం ఉదయం మృతి చెందాడు. శ్రీనివాసుల నాయక్‌కు భార్య రాములమ్మ,ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి వాముల దగ్ధం

గుత్తి రూరల్: బసినేపల్లి గ్రామంలో రైతు బోయ జగన్నాథంకు చెందిన గడ్డి వాములు అగ్నికి ఆహుతయ్యాయి. బాధితుడి తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు జగన్నాథం పశువుల మేత కోసం వరి గడ్డి, వేరుశనగ పొట్టు కొనుగోలు చేసి పొలంలో వాములు వేశారు. శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వాములకు నిప్పు పెట్టడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగి గడ్డి మొత్తం కాలి బూడిదైంది. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతు వాములు కాలిపోయిన విషయాన్ని గుర్తించాడు. సుమారు రూ.24వేలు నష్టం వాటిల్లినట్లు రైతు రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సత్యసాయి తాగునీటి పైప్‌లైన్ లీకేజీ



ఎగిసిపడుతున్న తాగునీరు

పామిడి: పట్టణంలోని బీసీసీరోడ్డు వద్ద సత్యసాయి తాగునీటి పథకం పైప్‌లైన్ ఆదివారం లీకేజీ అయింది. దీంతో స్థానిక గుప్తాకాలనీ, జూనియర్ కళాశాల సమీప ప్రాంతంలో లీకేజీ నీరు రోడ్డుపై భారీగా ప్రవహించింది. దీంతో రాకపోకలకు ఇబ్బంది కలిగింది. తరచూ పైప్‌లైన్ లీకేజీతో రోడ్డు పొడవునా నీరు ఉబుకుతుండడంతో ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సమస్య పరిష్కరించమని పలుమార్లు సంబంధింత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఓపెన్ ఫోరమ్ వేదిక మార్పు

గుంతకల్లు రూరల్: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి నేపథ్యంలో ఈనెల 13న గుంతకల్లు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జరగాల్సిన ప్రజా వేదిక కార్యక్రమాన్ని అదే రోజు గుత్తి డ్వామా కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జాషువా తెలిపారు. ఈమేరకు ఆదివారం ఓ ప్రకటన పేర్కొన్నారు.

మార్మోగిన సుబ్రహ్మణ్యేశ్వరుడి నామస్మరణ



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



పూజలందుకున్న శ్రీవల్లి, దేవసేన సమేతస్వామి

- ముగిసిన గుంటికింద సుబ్రహ్మణ్యేశ్వరుడి తిరునాల

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాలుగో ఆదివారం తిరునాల ఘనంగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వర నామస్మరణతో కోటంక కొండ మార్మోగింది. శనివారం రాత్రి స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పల్లకిలో గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ స్వామి సన్నిధికి చేర్చారు. ఆదివారం తెల్లవారుజామున నాగదోష నివారణ హోమం నిర్వహించారు. స్వామిని పల్లకీలో ఊరేగించారు. వీటిని తిలకించడానికి భక్తులు అధిక సంఖ్యలో జిల్లా నలుమూలల నుంచేగాక చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. 108 సాలాగ్రామ శివలింగాల చుట్టూ భక్తులు ప్రదక్షిణలు చేశారు.అలాగే పుట్ట వద్ద మహిళలు పూజలు చేశారు. సంతానం కాని వారు పూజలు చేస్తే సంతానం కలుగుతారని భక్తుల నమ్మకం. స్వామివారి మూల విరాట్ వద్ద ఉన్న నీటిని భక్తులు బాటిళ్లలో తీసుకొని సేవించారు. ఇలా చేయడం వల్ల సకల రోగాలు నివారణ అవుతాయని ప్రజల నమ్మకం. 35 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి, నాగుల పడగ, నంది రాతి విగ్రహాలు వద్ద భక్తులు సందడి కనిపించింది. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బిరెడ్డి, సభ్యులు, ఓ బాబు ఏర్పాట్లు చేశారు.

కళకళలాడిన గాజుల, టబొమ్మల అంగళ్లు..

ఈసందర్భంగా గాజుల అంగళ్లు, తిను బండారాలు, చెరకు, బొరుగుల అంగళ్లు, రెండు రోజుల ముందే వ్యాపారస్తులు ఏర్పాటు చేసుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో భక్తులతో అంగళ్లన్నీ కిటకిటలాడాయి. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపారు. భక్తుల సౌకర్యార్థం మాజీ జెడ్పీటీసీ విశాలాక్షి, విజయ భాస్కర్ కుటుంబ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

దైవభీతితో మానవత, నైతికత



మాట్లాడుతున్న జమాతే ఇస్లామ్ హింద్ సభ్యులు

గుత్తి: ఇటీవల సమాజంలో నైతిక, మానవతా విలువలు లోపించాయని, దైవ భీతితో అవి జనిస్తాయని జమాతే ఇస్లామి హింద్ మండల అధ్యక్షుడు ఫజులుల్లా అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రముఖ సామాజిక, ఆధ్యాత్మిక సంస్థ జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా జాగృతి ఉద్యమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ప్రజల్లో జనాల్లో నైతికత, మానవీయ విలువలు పాదుకునేలా కృషి చేస్తామన్నారు. నైతిక, మావవీయ విలువలు పెంపొందితే సమాజం అభివృద్ధి చెందడంతో పాటు ప్రశాంతత నెలకొంటుందన్నారు. జమాతే ఇస్లామి హింద్ సంస్థ సభ్యులు మౌలానా అబ్దుల్ హఖ్, మహ్మద్ షరీఫ్, మస్తాన్, మౌలానా ముస్తాఖ్ రషాదీ, జఫ్రుల్లా, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. కదిరప్పస్వామి రథోత్సవం



ఉచిత సామూహిక వివాహాలను నిర్వహిస్తున్న దృశ్యం



పూజా కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: వెంకటాంపల్లి గ్రామ కసుమల్లో కొలువదీరిన పెద్ద కదిరప్ప స్వామి రథోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి దర్శనార్థం భారీగా తరలి వచ్చిన భక్తజనంతో వెంకటాంపల్లి కొండ ప్రాంతం కిటకిట లాడింది. ఆలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో వేకువజామునే లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణోత్సవాన్ని కనుల పండుగగా నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో పెరవలి పారా విశ్వనాథ్ ఆధ్వర్యంలో సుమారు 54 జంటలకు సామూహిక వివాహాలు నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు అందంగా అలంకరించబడిన రథోత్సలో లక్ష్మీనరసింహస్వామి వార్ల ఉత్సవమూర్తులను కొలువదీర్చి రథాంగహోమం, బలిహరణ పూజలు నిర్వహించారు. అనంతరం వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణల మధ్య రథాన్ని లాగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులకు అన్నదానం చేపట్టారు.

పూజల్లో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి

మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో లక్ష్మీనరసింహస్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం ఆమెకు స్వామివారి తీర్థ ప్రసాదాలతో పాటు, పట్టువస్త్రాలను అందజేసి సత్కరించారు. స్వామివారి దర్శనానంతరం ఉచిత సామూహిక వివాహాల్లో పాల్గొన్న ఆమె నూతన వధూవరులను ఆశీర్వదించారు.

కుష్టు నిర్మూలనలో భాగస్వాములు కావాలి



కుష్టు బాధితులకు దుస్తులు, భోజనం, ప్లేటు, గ్లాసు అందిస్తున్న షాకీర్

తాడిపత్రి టౌన్ : కుష్టు నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తాడిపత్రి ఏరియా ఆస్పత్రి వైద్యాధికారిణి రామతులసి, క్రిష్టిపాడు, పాతకోట పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీనివాసుల రెడ్డి, సుమన్ పిలుపునిచ్చారు. కుష్టు నివారణ పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయంలో కుష్టు నిర్మూలనపై అవగాహన సమావేశం జరిగింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు షాకీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో 20 మంది బాధితులకు దుస్తులు, ప్లేట్లు, గ్లాసులను క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. అనంతరం వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు రామతులసి, శ్రీనివాసుల రెడ్డి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుష్టు వ్యాధి కేంద్ర సూపర్‌వైజర్ సునీల్, మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, రోటరీ క్లబ్ సభ్యులు సత్యప్రసాద్‌రెడ్డి, సంజన్న, రామసుబ్బారెడ్డి, రఫీ తదితరులు పాల్గొన్నారు.